ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలి : ఎమ్మార్పీఎస్

యాదగిరిగుట్టలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

యాదగిరిగుట్ట, డిసెంబర్4 : రాబోయే శీతాకాలపు అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదింపజేసి చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కూరెళ్ల రమేశ్, రాష్ట్ర కార్యదర్శి బైరపాక నాగరాజు డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూల మాల వేసి బైకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు పథకానికి బదులుగా రూ. 12 లక్షలతో అంబేద్కర్ పేరుతో నూతన పథకాన్ని అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మాటమార్చారని అన్నారు. మాదిగలకు అసైన్డ్ భూములకు పట్టాలను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం మహేందర్, కార్యదర్శి బొట్ల శ్రీను, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంఘీ స్వామి, మండల అధ్యక్షుడు వడ్లకొండ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి దుబ్బాసి కుమార్, నాయకులు వంగపల్లి చిరంజీవి, బైరపాక సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలి

- అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 4 : ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాల కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ సూచించారు. కలెక్టర్ కార్యాలయం సంబంధిత అధికారులతో బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 7న ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో సాయంత్రం 6 గంటలకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో ప్రజా కళాయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, డీపీఆర్ఓ అరుంధతి, వైద్యా ఆరోగ్య అధికారి మనోహర్, ఎస్సీ, బీసీ, రెసిడెన్షియల్ జిల్లా అధికారులు, జయపాల్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ రైస్ మిల్లులో అధికారుల తనిఖీ

- సీఎంఆర్ ఇవ్వకుండా ధాన్యం వదిలేసిన మిల్లు యజమానులు
- రూ.17 . 67 కోట్ల ధాన్యం బాకీ ఉందంటున్న అధికారులు

రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 4 : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో లక్ష్మీ నరసింహ అగ్రి ఇండస్ట్రీస్ రైస్ మిల్లును విజిలెన్స్ సివిల్ సప్లయ్ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ ఓఎస్‌డీ అంజయ్య మాట్లాడుతూ 2022–23 యాసంగి సీజన్‌కు చెందిన ప్రభుత్వ ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ కోసం తీసుకొని ఇవ్వడం లేదని, 66,690 క్వింటాళ్ల ధాన్యానికి రూ. 17.67 కోట్ల బాకీ ఉందని తెలిపారు. మిల్లు డిఫాల్టర్ అయినందున డబ్బులు చెల్లించడం లేదని, ధాన్యాన్ని ప్రొడక్ట్ చేయడం లేదని చెప్పారు. ధాన్యాన్ని వదిలేసి మిల్లును మూసేసి యజమానులు వెళ్లిపోయారని తెలిపారు. ధాన్యాన్ని వదిలేయడంతో వర్షానికి తడుస్తున్నాయని, కోతులు తింటున్నాయని చెప్పారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు సమగ్ర నివేదికను అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట ఎమ్మార్వో కమల్‌పాషా, ఎస్ఐ పుల్లయ్య, సివిల్ సప్లయ్ టీడీ బాలమణి, ఎంఆర్ఐ గుత్తా వెంకటరెడ్డి, ఏఆర్ఐ నరసింహారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ రాములు ఉన్నారు.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలి : ఎంపీడీఓ

ఆత్మకూరు(ఎం) సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్4 : మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలల్లో మండల స్థాయి అధికారులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ...ప్రతి పాఠశాలకు వెళ్లి నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్నం భోజనం అందివ్వడంతో పాటు పరిశుభ్రతను పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎంఈఓ కొత్త మహదేవరెడ్డి, సూపరింటెండెంట్ ఎలిమినేటి లోకేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ హిందువులకు సంఘీభావంగా నిరసన ర్యాలీ

భువనగిరి అర్బన్ డిసెంబర్ 4 : హిందూ ఐక్యవేదిక యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో బుధవారం బంగ్లాదేశ్ హిందువులకు సంఘీభావం తెలుపుతూ పట్టణంలోని సావర్కర్ రోడ్డు నుంచి తాసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పెద్ద ఎత్తున వివిధ కుల సంఘాలు, హిందూ సంఘాలు, భజన బృందాలు, మహిళలు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందూ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బంగ్లాదేశ్లో హిందువులను కాపాడడానికి ఐక్యరాజ్యసమితి వెంటనే చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాధం ప్రకాశ్, హిందూ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి కాలేరు లక్ష్మణ్, అయ్యప్ప మాలధారులు విశ్వరూపం, చెన్నా మహేశ్, ఉపేందర్, చింత బాలయ్య, విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత సహ కార్యదర్శి తోట భాను ప్రసాద్, నాయకులు తాడెం పాండు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టెంట్ సామాను కోసం ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 4: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 7న జరిగే కళాజాతర కార్యక్రమానికి ఉపయోగించే టెంట్‌హౌజ్, సౌండ్ సిస్టమ్స్‌తో పాటు సంబంధిత సామానులను సరఫరా చేసేందుకు ఏజెన్సీలు మున్సిపల్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. మరిన్ని పూర్తి వివరాల కోసం మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

శ్రీకాంతాచారి వర్ధంతికి ఎమ్మెల్యే సామేల్ ఎందుకు రాలేదు : బీఆర్ఎస్

మాట్లాడుతున్న నాయకులు యాకూబ్‌రెడ్డి తదితరులు

మోత్కూరు, డిసెంబర్4 : మండలంలోని పొడిచేడుకు చెందిన మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతి సభకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను ఆహ్వానించినా రాకపోవడం అమరవీరులను అవమానపర్చినట్లేనని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను తెలంగాణ ఉద్యమకారుడనని గొప్పలు చెప్పుకునే ఎమ్మెల్యే సామేల్ నియోజకవర్గంలోని సొంత ఊరుకు సమీపంలో ఉన్న అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతికి రాకపోవడానికి కారణమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. 13 యేండ్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎప్పుడు కూడా శ్రీకాంతాచారి త్యాగాన్ని, అమరత్వాన్ని మర్చిపోలేదని, వర్ధంతి సభలను నిర్వహించిన సంగతి మాతృమూర్తి శంకరమ్మ గుర్తు చేసుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి అందరి కుటుంబాలకంటే ఎక్కువ శంకరమ్మ కుటుంబానికి న్యాయం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేశ్, నాయకులు విష్ణుమూర్తి, సత్యంగౌడ్, కొణతం మహేందర్‌రడ్డి, బందెల శ్రీను, చంద్రమౌళి, నెర్లకంటి మత్స్యగిరి, మొరిగాల శ్రీను, పొన్నెబోయిన మత్స్యగిరి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో సంక్షోభంలో సంక్షేమ హాస్టళ్లు

- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు

చౌటుప్పల్ : తూప్రాన్‌పేటలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వద్ద తాళం వేయడంతో గేటు బయట నుంచి విద్యార్థులతో మాట్లాడుతున్న తుంగ బాలు

చౌటుప్పల్/రామన్నపేట, డిసెంబర్ 4 : కాంగ్రెస్ సర్కారు పాలనలో సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గురుకుల బాట ఇన్‌చార్జి తుంగ బాలు అన్నారు. చౌటుప్పల్ మండలంలోని తూప్రాన్‌పేట సాంఘిక సంక్షేమ గురుకులం, మహాత్మా జ్యోతిబా పూలె పాఠశాలలను బుధవారం ఆయన గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. అనంతరం రామన్నపేట మండలం జనంపల్లిలోని గురుకుల బాలికల పాఠశాలలో సమస్యలను తెలుసుకునేందుకు వచ్చారు. ఇక్కడ బీఆర్ఎస్‌వీ నాయకులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత అనుమతి ఇవ్వకపోవడంతో గేటుముందే నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా తుంగ బాలు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల స్థితిగతులను, సమస్యలను తెలుసుకోవడానికి వస్తే కనీసం లోపలికి రానివ్వకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. గురుకులాల్లో అన్ని సౌకర్యాలు ఉంటే భయమెందుకని ఆయన ప్రశ్నించారు. సమస్యలు బయటకు రాకుండా గేట్లకు తాళాలు వేయడం సరైంది కాదన్నారు. పిల్లలను సైతం బయటకు రానివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని గురుకులాల్లో 43 మంది విద్యార్థులు చనిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పాఠశాలలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా పిల్లలకు బూట్లు, దుస్తులు, స్పోర్ట్స్ వస్తువులు, బ్యాగులు ఇవ్వలేదని తెలిపారు. కనీసం పిల్లలు మంచినీళ్లు తాగే ప్లాంట్‌ను రిపేర్ చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే మంత్రులతో సమీక్ష సమావేశం నిర్వహించి విద్యార్థులు, తల్లిదండ్రులకు భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులకు సరిగా ఆహారం పెట్టడం చేతకాని సీఎం రేవంత్ రెడ్డి, ఈ విషయాలు బయటకు రాకూడదని నియంతృత్వ పోకడలకు పోతున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ ఇన్‌చార్జి నలపరాజు రమేశ్, ప్రధానకార్యదర్శి ఒంటెద్దు లింగస్వామి, నాయకులు దుబ్బాక ఆకాశ్ రెడ్డి, ఎండీ ఫరాన్, కోల శేఖర్, నోముల సుకుమార్ రెడ్డి, గంగాదేవి శివ, రాజు, నవీన్, ప్రవీణ్‌కుమార్, రవి, సురేశ్, కమలాకర్, శ్రీకాంత్, రామన్నపేట బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి పోశబోయిన మల్లేశం, మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు జాల అమరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సోషల్‌మీడియా అధ్యక్షుడు ఆవుల శ్రీధర్, బీఆర్ఎస్వీ నాయకులు వల్లమల్ల సూర్యప్రకాశ్, చిన్నపాక రమేశ్, వంటల చేతన్, చైగోని సాయి, కళ్యాణ్, నక్క నరేందర్, నల్ల సైదులు, కొండ గడప చింటూ, గంజి గణేశ్, వల్లమల్ల ఆనందం, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట: లోపలికి అనుమతించకపోవడంతో జనంపల్లి గురుకుల పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

ఆధార్ కార్డులు పంపిణీ చేసేవారేరి?

ఆత్మకూరు(ఎం) పోస్టాఫీస్ కార్యాలయంలో కుప్పలుగా పడి ఉన్న ఆధార్‌కార్డులు

ఆత్మకూరు(ఎం),డిసెంబర్4 : మీసేవ కేంద్రాల్లో పలువురు ఆధార్‌కార్డు అప్‌డేట్‌తోపాటు పేర్లు, చిరునామాల మార్పు కోసం నమోదు చేయించుకున్నారు. కేంద్ర ప్రభుత్వం సంబంధిత వ్యక్తుల కార్డులను పోస్టాఫీస్ కార్యాలయానికి అందజేసినప్పటికీ పంపిణీ చేసేవారు లేక కార్యాలయంలోనే కుప్పలుకుప్పలుగా పడిఉన్నాయి. ఇంతకు ముందు కార్డులు పంపిణీ చేసే ఉద్యోగులకు ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడంతో మానేసినట్లు పోస్టాఫీస్ కార్యాలయం పోస్ట్‌మాస్టర్ అమర్‌నాథ్ తెలిపారు. ప్రతి రోజూ కార్యాలయానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆధార్‌కార్డులు చేరడంతో పంపిణీ చేసేవారు లేక సంబంధిత వ్యక్తులే వచ్చి కార్డును వెతుక్కొని తీసుకెళ్తున్నారని పోస్ట్‌మాస్టర్ తెలిపారు.

గీత కార్మికుల హామీలను అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజు

రామన్నపేట, డిసెంబర్4 : కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బావండ్లపల్లి బాలరాజు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన కల్లుగీత కార్మికుల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రామన్నపేట మండలంలో రెండువేల కుటుంబాలు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ప్రతి గీత కార్మికుడికి బైకు, సేఫ్టీ మోకులు ఇవ్వాలని, ప్రతి గ్రామంలో 5ఎకరాల భూమిని కేటాయించి తాటిచెట్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పులిభిక్షం, కోశాధికారి మునుకుంట్ల లెనిన్, లగ్గాల స్వామి, పలుసం కిష్టయ్య, పబ్బు వెంకన్న, గుండాల సుందర్, పబ్బు గంగాధర్, చెరకు శంకరయ్య, గడ్డమీది సత్తయ్య పాల్గొన్నారు.

న్యాస్ పరీక్ష ద్వారా విద్యార్థుల ప్రతిభ అంచనా

న్యాస్ పరీక్ష నిర్వహణ గురించి ఎంఈఓను అడిగితెలుసుకుంటున్న ఎస్ఈఆర్టీ సభ్యుడు గణపతి శర్మ

బొమ్మలరామారం, డిసెంబర్4 : న్యాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే 2024) పరీక్ష ద్వారా 3,6,9 తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అంచనా వేయవచ్చని ఎస్ఈఆర్టీఈ సభ్యుడు గణపతి శర్మ అన్నారు. మండలంలో కేంద్రంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రాథమిక పాఠశాల, గోవింద్ తండా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం న్యాస్ పరీక్ష జరిగింది. ఆయన పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. మండలంలో ఈ పరీక్షకు 87మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆయన వెంట జిల్లా సమగ్ర శిక్ష ఏఎంఓ పెసరు లింగారెడ్డి, ఎంఈఓ రోజారాణి, జీహెచ్ఎం వరలక్ష్మి, సీఆర్పీలు శ్రీహరి, విశ్వరూపం పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

వైద్య శిబిరంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామానుజులరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 4 : వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు సూచించారు. తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు వైఆర్‌జి కేర్ అంక్‌వర్కర్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని 4వ వార్డు రాయగిరిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, వార్డు కౌన్సిలర్ నాయిని అరుణ పూర్ణచందర్, పల్లె దవాఖాన మెడికల్ ఆఫీసర్ నిఖిల్, ఐసీటీటీ కౌన్సిలర్ పి.ముత్యాలు, నర్సింహ, లింక్ వర్కర్ స్కీమ్ సంస్థ డీఆర్‌పీ ఎస్.నర్సింహాచారి, జోనల్ సూపర్‌వైజర్ బాలజ్యోతి, లింక్ వర్కర్ ఆరోగ్యరాణి, భాగ్యలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మనోహర్

అనంతారం పల్లె దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మనోహర్

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 4 : ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంతోపాటు నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్ సూచించారు. ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని అనంతారం పల్లె దవాఖానను ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రిలో రోగుల సంఖ్య, తదితర రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్ కొండా మురళీమోహన్, డాక్టర్లు సురేశ్, వసుధ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మరణించినా మరికొందరికి ప్రాణదానం

బైరు అంజమ్మ (ఫైల్ ఫోటో)

చౌటుప్పల్, డిసెంబర్ 4 : తాను చనిపోతూ మరికొంత మందికి ప్రాణం పోసేలా వృద్ధురాలు అవయవ దానం చేసింది. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో గ్రామానికి చెందిన బైరు అంజమ్మ (68) గత నెల 27న తన ఇంట్లో అన్నం తింటూ పక్క ఇంటి మహిళతో మాట్లాడుతుండగా అకస్మాత్తుగా కింద పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అప్పటి నుంచి వైద్యచికిత్సలు నిర్వహిస్తున్నారు. మంగళవారం బ్రెయిన్ డెడ్ అయినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో కటుంబ సభ్యుల ఇష్టం మేరకు అవయదానం చేయవచ్చని దవాఖాన సిబ్బంది, జీవన్‌ధాన్ ప్రతినిధులు సూచించారు. ఆమె తల్లి ద్వారా మరి కొంత మంది జీవితాల్లో వెలుగులు నిండుతాయని తెలుసుకున్న కొడుకులు బైరు సుదర్శన్ గౌడ్, కిరణ్ గౌడ్ అవయవాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. దీంతో గ్రామస్తులు, పలువురు వారిని అభినందించారు.

ఆలేరు అభివృద్ధిలో ఎమ్మెల్యే విఫలం : బీజేపీ

యాదగిరిగుట్ట, డిసెంబర్4 : ఆలేరు నియోజకవర్గ అభివృద్ధిలో స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పూర్తిగా విఫలమయ్యాడని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బైకు ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. బ్రిడ్జిని తొలగిస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే కేవలం ఫొటోలకే పరిమితమయ్యారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీను, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, మండల అధ్యక్షుడు గుంటుపల్లి సత్యం, ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు బందారపు భిక్షపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

చౌటుప్పల్, డిసెంబర్ 4 : చౌటుప్పల్ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు బ్రెడ్, బిస్కెట్, చాక్లెట్‌లను బుధవారం పంపిణీ చేశారు. భవానీ యూత్ ఆధ్వర్యంలో పాలకూర్ల మంజుల 12 వర్ధంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. యూత్ ప్రతినిధులు వరగంటి రాజేందర్ గౌడ్, బొబ్బిళ్ల సుభాశ్, మహేందర్ గౌడ్, చిట్టంపల్లి జగన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఆత్మకూరు(ఎం), డిసెంబర్4 : మండల కేంద్రానికి చెందిన బత్తిని మల్లేశ్‌గౌడ్ కొన్ని సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం బుధవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో రూ.23వేల ఆర్థిక సాయం అందజేశారు. గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పంజాల నర్సయ్యగౌడ్, గౌడసంఘం రాష్ట్ర నాయకుడు బీసు చందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు రంగ సత్యనారాయణ, గడ్డం దశరథ, నాతిరాజు, మల్లేశ్, స్వామి, విష్ణు, బాల్‌రాజ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు

వలిగొండ, డిసెంబర్4 :మండల కేంద్రానికి చెందిన ఎల్లంకి పుష్పమ్మ అనే మహిళ బుధవారం ఉదయం ఇంటిముందు పనులు చేసుకుంటుండగా కుక్కలు గుంపుగా దాడి చేసి గాయపరిచాయి. గాయపడిన మహిళకు స్థానిక ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించారు. కుక్కల నివారణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా సుదర్శన నారసింహ హోమం

ఉత్తర మాఢవీధుల్లో నిర్వహించిన సుదర్శన నారసింహ హోమంలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, డిసెంబర్4 : ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో బుధవారం సుదర్శన నారసింహహోమం ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం తెలంగాణ రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఆలయ ఉత్తర మాఢవీధుల్లో సుదర్శన హవనం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు పాల్గొన్నారు. ఆర్జిత పూజల్లో భాగంగా ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణమూర్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులకు సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. బంగారు పుష్పాలతో దేవేరులను అర్చించారు. శ్రీమన్యుసూక్త పారాయణం చేశారు. ప్రత్యేకంగా బంగారంతో తయారు చేసిన 108 పుష్పాలతో శ్రీవారి సన్నిధిలో ఉంచి వాటితో అర్చించారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూపంలో స్వయంభూ నారసింహస్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవారు, ఆంజనేయస్వామివారికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారి సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం నుంచి రాత్రి వరకు పలు దఫాలుగా సువర్ణ మూర్తులకు బంగారు పుష్పాలతో అర్చనలు జరిపారు. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారి తిరువారాధన, సహస్రనామార్చన, శయనోత్సవ సేవను ఘనంగా జరిపారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

చౌటుప్పల్, డిసెంబర్ 4 : మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా బుధవారం మెప్మా ఆధ్వర్యంలో 15 మంది మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.1.50లక్షలు రుణాలు ఆయన అందించారు. 50మంది వీధి వ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున రుణ సదుపాయం చెక్కులను కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన